





ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

గురువారం, 21 మే 2026 పేజీలు 10:





### వేములవాడ రైస్ మిల్లుల్లో
## విప్ ఆది శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ..

- రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై కఠిన చర్యలు.
- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం.. ఆందోళన వద్దు:
- మర్రిపల్లి ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ పరిశీలనలో ప్రభుత్వ విప్ భరోసా..

వేములవాడ మే 20 (విజన్ ఆంధ్ర )

వేములవాడ పరిధిలోని మర్రిపల్లి రైస్ మిల్లులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, మిల్లింగ్ విధానాన్ని పరిశీలించిన ఆయన, రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, మిల్లర్లు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే రైస్ మిల్లులకు తరలించేందుకు వీలుగా అదనంగా లారీలు, వ్యాన్లను రప్పిస్తున్నామని, రైతులు కూడా తమ ట్రాక్టర్లను వినియోగించుకుంటున్నారని తెలిపారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మిల్లులతో పాటు మిగతా ధాన్యం నిల్వల కోసం జిల్లా కేంద్రంలోని అపారెల్ పార్క్ గోదాములో దిగుమతికి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు



## ఇంటర్ విద్యాశాఖలో బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలి



విజన్ ఆంధ్ర : చిగురుమామిడి:

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇంటర్మీడియట్ విద్యాశాఖలో ఉద్యోగులు, అధ్యాపకుల బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీజీఎల్ఏ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో పాటు విద్యాశాఖ కార్యదర్శి, ఇంటర్ విద్యా డైరెక్టర్‌లకు ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రం సమర్పించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోరిక మేరకు బదిలీలపై నిషేధాన్ని తొలగిస్తూ ఆర్థిక శాఖ గత నెల 21న జీవో నంబర్ 38 జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. దీని ప్రకారం మే 1 నుంచి 31వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ ముగించాల్సి ఉందన్నారు. అనంతరం విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయం నుంచి కూడా ఏప్రిల్ 25న మెమో నంబర్ 103/వీజ/2026 ద్వారా అంతర్గత ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఇంటర్ విద్యాశాఖలో ఇంతవరకు బదిలీల షెడ్యూల్ ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. దీనిపై అధికారులను సంప్రదించినా ఎలాంటి స్పందనా లేదని, సాంకేతిక కారణాలు ఏవైనా ఉంటే కండిషనల్ ట్రాన్స్‌ఫర్ షెడ్యూల్ ద్వారా అయినా బదిలీలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 2023 బ్యాచ్ జూనియర్ లెక్చరర్లకు గత 16 ఏళ్లుగా బదిలీలు జరగలేదని, ఫలితంగా వారు సొంత కుటుంబాలకు దూరంగా ఉంటూ తీవ్ర ఆర్థిక, మానసిక, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సంపత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల 2023 బ్యాచ్ అధ్యాపకులకు బదిలీల్లో ఉన్న మూడేళ్ల కనీస సేవా నిబంధనను తొలగించి, దానిని రెండేళ్లకు కుదించాలని డిమాండ్ చేశారు. లేదా బదిలీల అర్హత కటాఫ్ తేదీని మే 3, 2026కు మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, తక్షణమే బదిలీల షెడ్యూల్ విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు

------------

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన...

- రాజకీయాలు మానుకొని అభివృద్ధికి సహకరించాలి..

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...**



కోనరావుపేట మే 20 (విజన్ ఆంధ్ర):(

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కొనరావుపేట మండలంలోని పల్లిమక్త గ్రామంలో పల్లిమక్త ఎల్లమ్మ గుడి నుంచి కొలనూరు వరకు సుమారు రూ. 1.65 కోట్ల సీఆర్ఆర్ నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. గ్రామాల మధ్య రహదారులు మెరుగుపడితే రవాణా సౌకర్యాలు పెరగడంతో పాటు రైతులు,విద్యార్థులు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.జగిత్యాల జిల్లా పొలాసా తరహాలో వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఆధునిక రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, పంటల నిర్వహణపై శిక్షణ అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ రంగ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా, ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడా ఆపడం లేదని ఆయన విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల విస్తరణలో వెనుకడుగు వేయడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.అభివృద్ధికి రాజకీయ పార్టీలతో సంబంధం ఉండకూడదని, ప్రజల అవసరాలే ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు. కొనరావుపేట మండలంలో కొన్ని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచులు లేకపోయినా అభివృద్ధి పనులు సమానంగా చేపడుతున్నామని అన్నారు. అయితే కొందరు వ్యక్తులు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఈ రహదారి నిర్మాణంతో పల్లిమక్త, కొలనూరు గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గి గ్రామీణ ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం లభించనుంది. స్థానిక ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిన్నా అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు మానుక సత్యం, జిల్లా కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా,వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్,గొట్టే రుక్మిణీ,స సర్పంచులు బోయినీ దేవరాజు, తిరుపతి నాయక్,నరేష్ నాయక్,మస్కూరి కాశీరాం,అప్పల నాగభూషణం, కోల స్వాతి శ్రీనివాస్,వంకాయల గౌతమి ప్రశాంత్,నాయకులు నాయిని ప్రభాకర్ రెడ్డి,పాకాల వినయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

----------------

## మండల రైతులకు అందుబాటులో జీలుగు,జనుము విత్తనాలు

- వ్యవసాయ శాఖ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి



విజన్ ఆంధ్ర :చిగురుమామిడి:

రైతులు ఎదురుచూస్తున్న జీలుగు,జనుము విత్తనాలు మండలంలోని వివిధ గ్రామాలకు చేరుకుంటున్నాయి.50 శాతం సబ్సిడీపై జీలుగు,జనుము విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి తెలిపారు.పచ్చి రొట్ట ఎరువుతో అధిక దిగుబడులు సాధించవచ్చని, పచ్చి రొట్ట సాగుతో భూసారం మరింత పెరుగుతుందని ఏవో పూర్ణచందర్ రెడ్డి తెలిపారు.జీలుగ విత్తనాలు 30కిలోల బస్తాకు 2452.50,జనుము విత్తనాలు 40కిలోల బస్తాకు ?3110పై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు.ఈ జీలుగు,జనుము విత్తనాలు చిగురుమామిడి మామిడి సొసైటీ, నవాబుపేట,సుందరగిరి, చిగురుమామిడి డిసిఎంఎస్ లలో,ఇందుర్తిలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.అవసరం ఉన్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## ఇటిక్యాల హనుమాన్ దేవాలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

రాయికల్, మే 20 (విజన్ ఆంధ్ర):

మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో నూతన హనుమాన్ దేవాలయ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా బద్దం మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మటి నరేష్, ప్రధాన కార్యదర్శిగా సామల్ల మహేష్, కోశాధికారిగా జవ్వాజీ నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా పాలెపు దశ కుమార్‌ను ఎంపిక చేశారు.సలహాదారులుగా కొల్లూరి వేణు, కొడిమ్యాల లింగమూర్తి, దండ వేణి గంగారాజం, కంటే నాగభూషణ్, నేతుల సోమయ్య, బొమ్మన ముత్తయ్య, గుండా ఆనందలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరితో కలిసిమెలిసి దేవాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, జిల్లా ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, ఉపసర్పంచ్ సాయి రెడ్డి, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ సేవా సమితి కార్యవర్గ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

------------

## రాయికల్‌లో అమృత్ 2.0 పనులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శంకుస్థాపన

రాయికల్, మే 23 (విజన్ ఆంధ్ర):

పట్టణంలో అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. రూ. 15 కోట్ల 20 లక్షల వ్యయంతో మంచినీటి సరఫరా పనులు, రూ. 3 కోట్ల 14 లక్షలతో రాయికల్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించడం, చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాల స్థాయి పెంపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు, మాజీ వైస్ చైర్మన్ రమాదేవి అచ్యుతరావు, కౌన్సిలర్లు, నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.






## వరుస దేవాలయ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్...

- రిమాండ్‌కు తరలింపు...
- నిందుతుని వద్ద బంగారు పుస్తెలు,వెండి కళ్ళు,
- నగదు రూ.2,000/-, కార్ జాకి మరియు స్పీకర్లు స్వాధీనం...
- నిందితునిపై చందుర్తి సర్కిల్ పరిధిలో ఏడు కేసులు నమోదు...
- వివరాలు వెల్లడించిన చందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్...

కోనరావుపేట మే 20 (విజన్ ఆంధ్ర):

కోనరావుపేట రుద్రంగి రెండు మండలాలలో వరుస దేవాలయ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని చందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్ తెలిపారు.ఈసందర్భంగా సి.ఐ రవీందర్ మాట్లాడుతూ.కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన మోకేనపల్లి బాబు,తండ్రి దేవయ్య, వయస్సు 36 సంవత్సరాలు అనే వ్యక్తి జల్సాలకు అలవాటు పడి సులభమార్గంలో డబ్బులు సంపాదించాలనుకొని నిర్ణయించుకొని సుద్దాల ఎల్లమ్మ దేవాలయంలో, కొలనూరు ఎల్లమ్మ దేవాలయంలో, నిజామాబాద్ పెద్దమ్మ దేవాలయంలో, కొండాపూర్ పెద్దమ్మ దేవాలయంలో, భూక్యారెడ్డి తండా జగదాంబ దేవాలయంలో, రామన్నపేట దాసాంజనేయ దేవాలయంలో మరియు రుద్రంగి మండలం మదేలయ్య దేవాలయలలో దొంగతనాలకి పాల్పడి, జల్సాలు చేసి, మిగిలిన దొంగిలించిన సొత్తును వేములవాడలో విక్రయించేందుకు వెళ్తుండగా పల్లిమక్త గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీస్ వారిని చూసి పరిపోతుండగా పట్టుకున్నామని ఆయన తెలిపారు. నిందితుడు బాబు దగ్గర నుండి సుద్దాల ఎల్లమ్మ దేవాలయంలో దొంగలించిన రెండు స్పీకర్లు, ఒక కార్ జాకీ, బంగారు పుస్తెలు, నగదు రూ.2,000 నిజామాబాద్ పెద్దమ్మ దేవాలయంలో దొంగలించిన వెండి కళ్ళు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.నిందుతున్ని పట్టుకోవడంలో కృషి చేసిన కొనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు విశాల్, జగన్, నాగరాజు లను ఆయన అభినందించారు

---------------

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి...

- భాజపా మండల అధ్యక్షుడు మిర్యాల కార్ బాలాజీ...



కోనరావుపేట మే 20 (విజన్ ఆంధ్ర):

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బీజేపీ కోనరావుపేట మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని తహసిల్దార్ కార్యాలయంలో మండల శాఖ తరుపున వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయని యెడల రైతులకు అండగా పోరాటం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి జలందర్, ఉపాధ్యక్షులు చింతల పరశురాములు, సోషల్ మీడియా మండల కన్వీనర్ లంబ వేణు, కార్యవర్గ సభ్యులు కడార్ల వికాస్, సీనియర్ నాయకులు జింక వెంకటి, అబ్బసాని రాములు, మోత్కు మోహన్, చల్ల జితేందర్ రెడ్డి, పొన్నం మహేష్, బూర్ల శంకర్, తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

---------------

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు ఆధునిక సాగుతోనే అధిక లాభాలు

మల్యాల, మే 20 (విజన్ ఆంధ్ర):



మల్యాల మండలంలో ?రామన్నపేట రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించేందుకు రామన్నపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త సాయినాథ్ మాట్లాడుతూ.. సాగునీటి యాజమాన్యం, పంట మార్పిడి, మరియు సక్రమమైన ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు.?జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కె ఎన్ ఎం 1638 28 వంటి వరి రకాలు సాగుకు ఎంతో అనుకూలమైనవని సూచించారు. అదేవిధంగా, పర్యావరణాన్ని కాపాడటంలో భాగంగా పంట కోతల తర్వాత పొలాల్లో కొయ్యలు (వరి దుబ్బలు) కాలిస్తే రూ. 5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నూకపల్లి గ్రామంలో ఇప్పటికే 125 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. సాంకేతికతను వాడుకుంటూ రైతులు యాప్ ద్వారా ఇంటి నుంచే సులభంగా యూరియా బుక్ చేసుకోవచ్చని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

---------------

## ఆన్లైన్ ఫార్మసిలను నియంత్రించాలి..!

- కరీంనగర్ లో స్వచ్ఛందంగా మెడికల్ షాపులు బంద్..



కరీంనగర్, మే 20, విజన్ ఆంధ్ర

ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ (ఏఐఓసీడి) మరియు తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త బంద్‌లో భాగంగా కరీంనగర్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులు స్వచ్ఛందంగా బంద్ చేయడం జరిగింది. స్థానిక కెమిస్ట్ భవన్‌లో జిల్లా కెమిస్టులు సమావేశమై బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. అనంతరం కెమిస్ట్ భవన్ నుండి సభ్యులందరూ కలిసి జిల్లాలో ఎక్కడైనా షాపులు తెరిచి ఉన్నచో వారిని ప్రత్యక్షంగా కలిసి బంద్‌కు మద్దతు తెలపలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉన్న సుమారు 1250 మెడికల్ షాపులలో అధిక శాతం షాపులు బంద్‌లో పాల్గొని సంఘీభావం ప్రకటించాయి. అయితే ప్రజలకు అత్యవసర మందుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అపోలో రీచ్ హాస్పిటల్‌లోని అపోలో ఫార్మసీ, ప్రభుత్వ ఆసుపత్రుల ఫార్మసీలు మరియు కొంతమంది హాస్పిటల్ ఫార్మసీలను అత్యవసర సేవల కోసం అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. అత్యవసర మందులు అవసరమైన ప్రజలకు డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని మందులు అందించే ఏర్పాట్లు చేయడం జరిగిందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆన్‌లైన్ ఫార్మసీల నియంత్రణ మరియు కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టిన జీ.ఎస్.ఆర్ 220 నిబంధనలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలు ఈ నిబంధనలను ఆధారంగా చేసుకొని మందులను డోర్ డెలివరీ ద్వారా విక్రయించడం వల్ల చిన్న మరియు మధ్యతరహా కెమిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అలాగే సరైన ధృవీకరణలు లేకుండా, నకిలీ ప్రిస్క్రిప్షన్లతో యాంటీబయోటిక్స్ మరియు హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ ఆన్‌లైన్ ద్వారా విక్రయించబడటం ప్రజారోగ్యానికి ప్రమాదకరమని, ఇటువంటి అక్రమాలను అరికట్టాలని కెమిస్టులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు కమటాల రామ్మోహన్, జనరల్ సెక్రటరీ గుండా మునిందర్ రాజు, కోశాధికారి కొంజర్ల మహేష్, వైస్ ప్రెసిడెంట్ ఆడెపు కమలాకర్, గౌరవ అధ్యక్షులు జిల్లా అశోక్ హోల్‌సేల్ విభాగ సభ్యులు పైడ శ్రీనివాస్, జిల్లా అమర్ తదితరులు పాల్గొన్నారు



## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేత...

- ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి..
- నిమ్మపల్లి సర్పంచ్ కమ్మరి స్వప్న నాగరాజు...

కోనరావుపేట మే 20 (విజన్ ఆంధ్ర):

రాష్ట్రంలో భానుడి భగభగలు తీవ్రతరంగా ఉన్నందున రాజన్న సిరిసిల్ల జిలా రెడ్ అలెర్ట్ లో ఉన్నదని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో ఎండ తీవ్రత పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామ సర్పంచ్ కమ్మరి స్వప్న నాగరాజు అన్నారు. బుధవారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వార్డు సభ్యులతో కలిసి వెళ్లి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే పని ముగించుకోవాలని సూచించారు. పని పనిచేస్తున్న సమయంలో కూలీలు తగు జాగ్రత్తలను పాటించాలని కోరారు. పని జరుగుతున్న ప్రదేశంలో కనీస వసతులు ఏర్పాటు చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఆమె వెంట వార్డు సభ్యులు చీకటి మధుకర్, కడారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

---------------

## దేవాలయ చోరీ కేసులో యువకుడు అరెస్ట్

- పంచలోహ గరుడ వాహనం దొంగతనంపై దర్యాప్తు వేగవంతం




తంగళ్లపల్లి రాజన్న సిరిసిల్ల , మే 20 (విజన్ ఆంధ్ర):

తంగళ్లపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి టెంపుల్ లో జరిగిన చోరీ ఘటనలో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర రావు వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం, ఒంగోలు జిల్లా మ్యాదరమెట్ల గ్రామానికి చెందిన చైతన్య మణికంఠ ప్రస్తుతం వేములవాడ పరిధిలోని తేలుకుంట ఇంద్రనగర్‌లో నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదనపు డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్న అతడు, తన బంధువులైన మరో ఇద్దరితో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు.జనవరి 21న ముగ్గురు కలిసి తంగళ్లపల్లి గ్రామానికి వెళ్లి దేవాలయ పరిసరాల్లో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు తెల్లవారుజామున యాగశాల తాళం బద్దలు కొట్టి అందులో ఉన్న పంచలోహ గరుడ వాహనాన్ని అపహరించి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లు విచారణలో బయటపడింది.ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మే 19న ఎస్ఐ ఉపేంద్ర చారి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా చైతన్య మణికంఠ అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. విచారణలో చోరీ ఘటనలో తన ప్రమేయాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సి.ఐ తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు.కేసు ఛేదనలో కృషి చేసిన ఎస్ఐ ఉపేంద్ర చారి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు సంపత్, శ్రావణ్‌లను సి.ఐ అభినందించారు.

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
గురువారం, 21. 05. 2026

## వేములవాడ డివిజన్ ఆత్మ కమిటీ నియామకం

**చైర్మన్‌గా ముస్కు ముకుంద రెడ్డికి బాధ్యతలు**

**రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన లక్ష్యం**

వేములవాడ, మే 20 (విజన్ ఆంధ్ర):



AGRICULTURAL
BLOCK FARMERS ADVISORY COMMITTEE

| S.No. | Name of the Farmer | Father's Name / Hu... Name |
|---|---|---|
| 1 | Musku Mukunda Reddy | Mallareddy |
| 2 | Duddeti Laxmi | Thirupathi |
| 3 | Erram Sathaiah | Rajaram |
| 4 | Vankayala Bhumaiah | Lingaiah |
| 5 | Chenadi Shyamala | Gov... |
| 6 | Banda Srinivas | [illegible] |

వేములవాడ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ కమిటీ)కి నూతన కమిటీని నియమిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన ముస్కు ముకుంద రెడ్డిని చైర్మన్‌గా నియమించగా, మరో 25 మంది సభ్యులను కమిటీలో చేర్చారు. గ్రామీణ రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను చేరవేయడం, పంటల నిర్వహణలో కొత్త విధానాలపై అవగాహన కల్పించడం, నీటి వినియోగంలో సమర్థత పెంపు, మార్కెటింగ్ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై రైతులకు సమాచారం అందించడం వంటి లక్ష్యాలతో ఆత్మ కమిటీ పనిచేయనుంది. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడంలో ఆత్మ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

-------------------

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- బిజెపి జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు



మల్లాపూర్, (విజన్ ఆంధ్ర ) : మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు లో వేగవంతం చేయాలని బిజెపి పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనూప్ రావు, మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేంద్ర మద్దతు ధర ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వహిస్తుందన్నారు. కొనుగోలులో ఆలస్యం అయినందున రైతులు తీవ్ర ఎదుర్కొంటున్నారని వాపోయారు. మక్కల కొనుగోలును వెంటనే కొనుగోలు చేయాలని లేనియెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకులు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస సదుపాయాలు గని సంచులు లేకపోవడంతో తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, బిజెపి బిజెపి మండల ఉపాధ్యక్షులు లవంగ శివకుమార్, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు ముష్కరి రాజ్ కుమార్, గుడ్లవత్ రాజేందర్, గడ్డం నర్సారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కోరుట్ల మాజీ ఎమ్మెల్యే

మల్లాపూర్, మే 20 (విజన్ ఆంధ్ర ) :



మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కోరుట్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు ఆ దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈయన వెంట మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్ గౌడ్, బిఆర్ఎస్వి నాయకులు బైర రవి, రాకేష్ తదితరులున్నారు

---------------

# రైతులను నిలువునా దోచుకుంటున్న "బ్రోకర్ " కాంగ్రెస్.?

- మిల్లర్లతో కుమ్మక్కై
  ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా మార్చి దోపిడి...
- కోర్రీలతో అఫీషియల్ గా కొత్త తరహా దోపిడీ..
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..



కొత్తపల్లి మే 20, విజన్ ఆంధ్ర :

ఆరుగాలం రైతు కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని ఇబ్బందుల గురి చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగడి కృష్ణా రెడ్డి అన్నారు. ప్రధానంగా నాణ్యమైన ఏ గ్రేడ్ పంటలను సైతం బి గ్రేడ్ గా మార్చడం, తాలు, తరుగు పేరిట కోతలు విధించి కాంగ్రెస్ సర్కార్ మిర్రర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తు, కాంగ్రెస్ పెద్ద బ్రోకర్ గా మారిందని ఘాటుగా విమర్శించారు. కొత్తపల్లి మండలంలో పంట కొనుగోలు కేంద్రాలను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక అధికార యంత్రాంగం తీరు పై ధ్వజమెత్తి మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా కావాలనే 'బి-గ్రేడ్'గా మారుస్తూ, క్వింటాల్‌కు రూ. 20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మిల్లర్లతో కొమ్మక్కై రైతులను నిలువునా ముంచే కొత్త తరహా దోపిడీకి తెర లేపిందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించారని, దీనివల్ల 17శాతం ఉండాల్సిన తేమ శాతం 11శాతం కి పడిపోయిందన్నారు. దీనివల్ల రైతులు క్వింటాల్‌కు అదనంగా 7 కిలోల ధాన్యాన్నినష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌సీఐ నిబంధనల కంటే తాలు తక్కువగా ఉన్నప్పటికీ, అధికార పార్టీ అండతో మిల్లర్లు చెలరేగిపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు. గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో సంచికి 5-6 కిలోల తరుగు తీసి రైతులకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ కూడా అదే బాటలో ప్రయాణిస్తుందని , అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నందుకు సిగ్గుండాలన్నారు. జిల్లావ్యాప్తంగా పంట కొనుగోలు మందకొడిగాకొనసాగుతున్నాయని, రైతులకు పంటపై ఏలాంటి ఆంక్షలు, కోతలు విధించకుండా పంట కొనుగోళ్ళను చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రధానంగాఎలాంటి తాలు, తరుగు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలనీ, కొనుగోలు కేంద్రాలకు లారీల సంఖ్యను వెంటనే రెట్టింపుచేయాలని, నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొంటున్న మిల్లర్లపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే అకాల వర్షాలతో రైతాంగం పంట నష్టపోకుండా టార్పాలిన్ లను సరఫరా చేయాలని, కాటా చిట్టి ప్రకారమే పేమెంట్ చేయాలని, బి కేటగిరి మోసాలను అరికట్టాలని, రవాణా సౌకర్యం మెరుగుపరచాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి సర్పంచులు కోమటిరెడ్డి అంజన్ కుమార్ నునుగొండ మానస ప్రవీణ్ ఉప సర్పంచ్ అరే నరేష్ కట్ల వెంకటేష్ సీనియర్ నాయకులు గుంజేటి శివకుమార్ జవ్వాజి రమేష్ కించ శేఖర్ సోమిరెడ్డి సత్యనారాయణరెడ్డి కడార్ల రతన్ కుమార్ కట్ల శ్రీనివాస్ సోమినేని కరుణాకర్ ఇల్లెందుల ఆనంద్ మెరుగు మల్లేశం బైరెడ్డి వంశీ కూరగాయల మల్లేశం పాల శీను తదితరులతోపాటు వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవాలయ చోరీ కేసులో యువకుడు అరెస్ట్

- పంచలోహ గరుడ వాహనం దొంగతనంపై దర్యాప్తు వేగవంతం

తంగళ్లపల్లి రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 20 (విజన్ ఆంధ్ర):

తంగళ్లపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి టెంపుల్ లో జరిగిన చోరీ ఘటనలో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర రావు వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం, ఒంగోలు జిల్లా మ్యాదరమెట్ల గ్రామానికి చెందిన చైతన్య మణికంఠ ప్రస్తుతం వేములవాడ పరిధిలోని తేలుకుంట ఇంద్రనగర్‌లో నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదనపు డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్న అతడు, తన బంధువులైన మరో ఇద్దరితో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు.జనవరి 21న ముగ్గురు కలిసి తంగళ్లపల్లి గ్రామానికి వెళ్లి దేవాలయ పరిసరాల్లో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు తెల్లవారుజామున యాగశాల తాళం బద్దలు కొట్టి అందులో ఉన్న పంచలోహ గరుడ వాహనాన్ని అపహరించి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లు విచారణలో బయటపడింది.ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మే 19న ఎస్‌ఐ ఉపేంద్ర చారి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా చైతన్య మణికంఠ అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. విచారణలో చోరీ ఘటనలో తన ప్రమేయాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సి.ఐ తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు.కేసు ఛేదనలో కృషి చేసిన ఎస్‌ఐ ఉపేంద్ర చారి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు సంపత్, శ్రావణ్‌లను సి.ఐ అభినందించారు.

---------------



## హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- లేబర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్

బోయినపల్లి రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 20 (విజన్ ఆంధ్ర):

బోయిన్పల్లి మండలం విలాసాగర్ గ్రామంలో సిపిఎం నాయకులు హమాలి కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ హమాలి కార్మికులకు ఎలాంటి సామాజిక భద్రత లేకుండా పని చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ప్రమాద బీమా, హెల్త్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్ వంటి సౌకర్యాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

55 సంవత్సరాలు పైబడిన హమాలి కార్మికులకు నెలకు రూ.5,000 పెన్షన్ అందించాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు.అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక లేబర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారికి అవసరమైన రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో హమాలి కార్మికులు ఆకుల అంజయ్య, రమేష్, ఐలయ్య, లచ్చయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
గురువారం, 21. 05. 2026



## భీమేశ్వర స్వామి ఆలయానికి వెల్లువలా భక్తుల కానుకలు

● హుండీ లెక్కింపులో రూ.83.09 లక్షల ఆదాయం నమోదు

వేములవాడ, మే 20 (విజన్ ఆంధ్ర):

వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి టెంపుల్ లో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు ఈరోజు లెక్కించారు. ఈ ఆలయం శ్రీ రాజా రాజేశ్వర స్వామి టెంపుల్ దేవస్థానానికి అనుబంధంగా కొనసాగుతోంది.ఆలయ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ఆరు రోజుల హుండీ లెక్కింపులో మొత్తం రూ.83,09,269 నగదు రూపంలో ఆదాయం లభించింది. అదనంగా 23 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల 900 గ్రాముల మిశ్రమ వెండి కూడా హుండీల ద్వారా వచ్చినట్లు తెలిపారు.వేసవి సెలవులు, ప్రత్యేక పూజలు, శుభకార్యాల నేపథ్యంలో ఆలయానికి భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. స్వామివారిపై ఉన్న భక్తిశ్రద్ధతో భక్తులు పెద్ద మొత్తంలో కానుకలు సమర్పిస్తున్నారని తెలిపారు.హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో, కరీంనగర్ ఏసీ కార్యాలయానికి చెందిన రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సహాయ కార్యనిర్వహణాధికారులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పర్యవేక్షకులతో పాటు శివరామకృష్ణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు

--------------

## దేవాలయ దొంగతనాల కేసులో నిందితుడు అరెస్ట్

● చోరీ సొత్తు స్వాధీనం చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

చందుర్తి రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 20 (విజన్ ఆంధ్ర):

చందుర్తి సర్కిల్ పరిధిలో వరుసగా చోటుచేసుకున్న దేవాలయ దొంగతనాల కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాలను చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన మోకినపల్లి బాబు (36) సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పలు దేవాలయాల్లో చోరీలకు పాల్పడ్డాడు. సుద్దాల ఎల్లమ్మ దేవాలయం, కొలనూరు ఎల్లమ్మ దేవాలయం, నిజామాబాద్ పెద్దమ్మ దేవాలయం, కొండాపూర్ పెద్దమ్మ దేవాలయం, భూక్యారెడ్డి తండా జగదాంబ దేవాలయం, రామన్నపేట దాసాంజనేయ దేవాలయం, రుద్రంగి మండలం మడేలయ్య దేవాలయాల్లో దొంగతనాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు వేములవాడకు వెళుతుండగా పల్లిమక్త గ్రామ శివారులో పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో నిందితుడు అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు.నిందితుడి వద్ద నుంచి రెండు స్పీకర్లు, ఒక కార్ జాకీ, బంగారు పుస్తెలు, వెండి కళ్ళు, నగదు రూ.2,000 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసులు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సి.ఐ తెలిపారు.నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన కొనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు విశాల్, జగన్, నాగరాజులను సి.ఐ అభినందించారు




---------------

# ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్



**మల్రిపల్లి రైస్ మిల్లుల్లో కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియపై సమీక్ష**

**రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

● -ధాన్యం తరలింపుకు అదనపు వాహనాలు, గోదాముల సిద్ధం

వేములవాడ రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 20 (విజన్ ఆంధ్ర)

వేములవాడ పరిధిలోని మల్రిపల్లి రైస్ మిల్లులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియలను పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం నిల్వ, రవాణా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం దిగుమతిలో ఆలస్యం చేసి రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రైస్ మిల్లర్లను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని పేర్కొన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేందుకు అదనపు లారీలు, వ్యాన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అవసరమైతే రైతులు ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యం తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.రైస్ మిల్లుల్లో నిల్వ సామర్థ్యం పూర్తైన తర్వాత మిగిలిన ధాన్యాన్ని గోదాములకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని అపరల్ పార్క్ గోదాంను కూడా సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

-----------------

## ఎన్టీపీసీలో స్వచ్ఛతా స్ఫూర్తి

● ప్రజల్లో పారిశుధ్య చైతన్యం నింపిన డీఎంఎస్

● క్లీన్ ఇండియా లక్ష్యానికి మద్దతుగా ఎన్టీపీసీ ముందడుగు

● స్వచ్ఛతను జీవనశైలిగా మార్చుకోవాలిరాఖీ సమంత పిలుపు

రామగుండం, మే 20 (విజన్ ఆంధ్ర) :



పర్యావరణ పరిరక్షణలో భాగంగా, రామగుండం టౌన్‌షిప్‌లో దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో ఒక విశేషమైన స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించబడింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని డీఎంఎస్ అధ్యక్షురాలు రాఖీ సమంత ప్రారంభించి, సభ్యులలో స్ఫూర్తిని నింపారు. స్వచ్ఛత అనేది కేవలం ఒక రోజు జరిగే పని కాదని, అది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో అలవాటుగా మారాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు టౌన్‌షిప్‌లోని కీలక ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించడంతో పాటు, చెత్తను సరైన పద్ధతిలో తొలగించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సామాజిక మార్పులో మహిళల పాత్ర ఎంతో కీలకమని చాటిచెబుతూ, వారు ప్రదర్శించిన ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది. ఈ స్వచ్ఛతా డ్రైవ్ ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే సామూహిక బాధ్యతను సమితి సభ్యులు గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా సాగుతున్న 'స్వచ్ఛ భారత్' లక్ష్యానికి అనుగుణంగా జరిగిన ఈ కార్యక్రమం, పచ్చని, పరిశుభ్రమైన రామగుండం కోసం ఎన్టీపీసీ చేస్తున్న కృషిని మరింత ముందుకు తీసుకెళ్లింది. క్రమశిక్షణతో కూడిన ఈ పారిశుధ్య పనులు స్థానికులలో పర్యావరణ స్పృహను పెంచడమే కాకుండా, సమిష్టి కృషితో మార్పు సాధ్యమని నిరూపించాయి. పర్యావరణహితమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో దీప్తి మహిళా సమితి చేస్తున్న ఈ ప్రయత్నంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. రాబోయే రోజుల్లో ఇటువంటి మరిన్ని కార్యక్రమాలతో సమాజంలో పరిశుభ్రత పట్ల మరింత చైతన్యం తీసుకురావాలని సమితి లక్ష్యంగా పెట్టుకుంది.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ఆపాలి

● బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్

మే 20(విజన్ ఆంధ్ర) ముస్తాబాద్



ముస్తాబాద్ మండల కేంద్రంలోని అన్ని ఐకేపీ (×ఖూ) మరియు సొసైటీ మార్కెట్లలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరత, హమాలీల కొరత, లారీల కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఒక బస్తాకు 42.500 గ్రాముల ధాన్యం సేకరిస్తూ, క్వింటాల్‌కు అదనంగా 5 కిలోల ధాన్యాన్ని రైతుల వద్ద నుండి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించిన తర్వాత కూడా మూడు నుంచి నాలుగు రోజుల పాటు దిగుమతులు చేయకుండా నిలిపివేస్తుండటంతో 42 డిగ్రీల ఎండలో రైతులు రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.మరోవైపు రైస్ మిల్లుల వద్ద తక్కువ బరువు వచ్చిందనే పేరుతో రైతుల వద్ద అధిక తూకం వేయడంతో పాటు "కటింగ్" పేరుతో మరింత ధాన్యాన్ని వసూలు చేస్తున్నారని ఆరోపించారు.రైతుల పట్ల ప్రభుత్వం రాక్షసత్వంగా వ్యవహరిస్తోందని, ఈ పరిస్థితిని వెంటనే ఆపి న్యాయబద్ధంగా ధాన్యం సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి, సర్పంచ్‌లు మెంగని శ్రీనివాస్, శ్రీనివాసరావు, ఉపసర్పంచ్‌లు కోలా కృష్ణ, గాడిచర్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శులు సర్దని నందం, వెంకన్న, మహేష్, కార్తీక్ రెడ్డి, వేణుగోపాల్, బెదురు ప్రశాంత్, రాయం రాజు, దీటి సత్తయ్య, వెంకట్ రెడ్డి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక

గురువారం, 21. 05. 2026

# బైక్ కుదువ దందా మాఫియా

- జోరుగా అక్రమ బైక్ ఫైనాన్స్
- చోరీ బైకులకూ ఫైనాన్స్.. ఎవరి ఆశీర్వాదం?
- పేదల అవసరాలపై వడ్డీ వ్యాపారుల వల
- బైక్ పెట్టి డబ్బు తీసుకుంటే.. వడ్డీతో జీవితమే బందీ
- నిబంధనలు పక్కన పెట్టి బైక్ ఫైనాన్స్ దందా
- బైక్ ఎవరిది? పత్రాలున్నాయా? పట్టించుకోని ఫైనాన్సర్లు
- అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్




రామగుండం, మే 20 (విజన్ ఆంధ్ర)

బైక్ కుదువ దందా.. యువత జీవితాలతో ఆట. అవును ఈ మాట ముమ్మాటికి నిజమే. గోదావరిఖని పట్టణంలో అక్రమ బైక్ ఫైనాన్స్ దందా రోజురోజుకీ జోరందుకుంటోంది. అత్యవసర అవసరాల కోసం చేతిలో డబ్బులేక ఇబ్బందులు పడుతున్న యువకులు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాల పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు ప్రైవేట్ వ్యక్తులు బైక్‌లను కుదువ పెట్టుకుని భారీ వడ్డీలకు డబ్బులు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... బైక్ ఎవరిది? దానికి పత్రాలు సరిగ్గా ఉన్నాయా? అది చోరీ వాహనమా? అనే విషయాలు కూడా పట్టించుకోకుండా డబ్బులు ఇచ్చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో చోరీ బైకులకు కూడా ఈ అక్రమ ఫైనాన్స్ కేంద్రాలు అడ్డాగా మారుతున్నాయనే అనుమానాలు బలం అవుతున్నాయి. రోజువారీ కూలీ చేసి కుటుంబాన్ని పోషించే కార్మికుడు అత్యవసరానికి బైక్ కుదువ పెడితే... తిరిగి తీసుకునే సమయానికి వడ్డీ పేరుతో అసలు కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఒకవైపు బ్యాంకుల్లో రుణాలు దొరకక, మరోవైపు అవసరాలు వెంటాడటంతో పేదలు ఈ వడ్డీ వ్యాపారుల చెంతకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తమవుతోంది. "ఒకసారి వారి చేతిలో పడితే బయటపడటం కష్టమే" అని పలువురు యువకులు చెబుతున్నారు.నగరంలో ఎక్కడ చూసినా గుట్టుగా నడుస్తున్న ఈ బైక్ ఫైనాన్స్ వ్యవహారాలపై అధికార యంత్రాంగం ఎందుకు నోరు మెదపడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎలాంటి లైసెన్సులు లేకుండా, ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా ప్రజల బలహీనతలను వాడుకుంటూ డబ్బులు దండుకుంటున్న వారిపై పోలీసులు, రవాణా శాఖ, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ ఫైనాన్స్ పేరుతో పేదల కన్నీళ్లు వ్యాపారంగా మారకముందే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

---------------



## గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్

- నగదు రహిత హెల్త్ కార్డులు ఇవ్వడానికి అంగీకరించిన ప్రభుత్వం.
- ఫలించిన టి.జి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఇ.టి.ఎల్.ఎ కృషి
- రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఏనుగుల సంతోష్

వేములవాడ ఆర్ సి మే 20 (విజన్ ఆంధ్ర)

ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నగదు రహిత చికిత్స అందించటం కోసం హెల్త్ కార్డ్స్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.ఆవుల సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుండి వివిధ సందర్భాలలో ఉన్నతాధికారులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రివర్యులకు సమర్పించిన వినతి పత్రాలను పరిశీలించిన అధికారులు ప్రభుత్వ ఉద్యోగులు మరియు జిల్లా పరిషత్ పాఠశాలలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల గురుకుల విద్యాలయాల సంస్థల పరిధిలో పనిచేస్తున్న గురుకుల ఉపాధ్యాయులకు కూడా హెల్త్ కార్డ్స్ సౌకర్యం కల్పిస్తూ మంగళవారం నాడు మెమో నెం.3739367 తో ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గురుకుల ఉపాధ్యాయులకు నగదు రహిత హెల్త్ కార్డ్స్ జారీ చేయుటకు కావలసిన వివరాలు ఉన్నతాధికారులు వెంటనే ఉపాధ్యాయుల నుండి సేకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి , ఉపముఖ్యమంత్రి , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, ఎస్సీ గురుకుల కార్యదర్శి మరియు ఇతర ఉన్నతాధికారులకు టి.జి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఇ.టి.ఎల్.ఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.ఆవుల సైదులు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఏనుగుల సంతోష్, జనరల్ సెక్రెటరీ జోసెఫ్ లు కృతజ్ఞతలు తెలిపారు.

------------------



## కొండగట్టు అంజన్న ఆలయంలో ముడుపుల లెక్కింపు పాత సామగ్రి వేలం

మల్యాల, మే 20 (విజన్ ఆంధ్ర):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో బుధవారం దేవస్థాన అధికారులు ముడుపుల లెక్కింపుతో పాటు, ఆలయానికి చెందిన పాత, పనికిరాని సామగ్రికి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగింది.ఇటీవల ఘనంగా నిర్వహించిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు స్వామివారికి సమర్పించిన ముడుపులను అధికారులు లెక్కించారు. ఈ లెక్కింపు ద్వారా ఆలయానికి మొత్తం రూ. 2,93,972 (రెండు లక్షల తొంభై మూడు వేల తొమ్మిది వందల డెబ్బై రెండు రూపాయలు) ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ అంజనారెడ్డి తెలిపారు.ఆలయంలోని పనికిరాని పాత సామగ్రికి నిర్వహించిన బహిరంగ వేలంలో వ్యాపారులు పోటీపడ్డారు. ఇందులో భాగంగా అల్యూమినియం సామగ్రిని ఉప్పుల సమ్మయ్య అనే వ్యాపారి కిలోకు రూ. 240 చొప్పున పాడుకొని కైవసం చేసుకున్నారు. అలాగే ఇనుప సామగ్రిని అనుముల కనకయ్య అనే వ్యాపారి కిలోకు రూ. 26.50 చొప్పున వేలంలో దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, అధికారులు రామేశ్వరరావు, శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనూష మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

----------------

## మల్యాల రాంపూర్ సబ్‌స్టేషన్‌లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



మల్యాల, మే 20 (విజన్ ఆంధ్ర):

మల్యాల మండలం రాంపూర్ సబ్‌స్టేషన్‌లో బుధవారం నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు బ్రేకర్ ఛార్జ్ చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆకునూరి శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో గ్రామంలో విద్యుత్ నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అంతేకాకుండా, లో-వోల్టేజ్ సమస్య పూర్తిగా తొలగిపోతుందని, తద్వారా గృహ వినియోగదారులకు, వాణిజ్య ప్రాంతాలకు సురక్షితమైన మరియు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా పంపిణీ చేయడానికి వీలవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం, డివిజనల్ ఇంజనీర్ గంగారం, మధుసూదన్ మరియు ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు

--------------

## మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారు: బీజేపీ ధ్వజం

మల్యాల, మే 20 (విజన్ ఆంధ్ర):



మల్యాల మండలంలో బి-కేటగిరి తాలు, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు రైతులను నిలువునా దోచుకుంటున్నారని బీజేపీ మల్యాల మండల అధ్యక్షులు గాజుల మల్లేశం ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, ఆర్.ఐ రాణికి వినతిపత్రం అందజేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని, కాటా చిట్టి ప్రకారమే పేమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వర్ష సూచన ఉన్నందున తక్షణమే టార్పాలిన్లు సరఫరా చేసి, రవాణాను వేగవంతం చేయాలన్నారు. లేనిచో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణి. మహిళా మోర్చా అధ్యక్షురాలు కటకం లత.బీజేవైఎం అధ్యక్షుడు పొన్నగంటి గౌతం. ఓబిసి మోర్చ మండలాధ్యక్షుడు బొమ్మన పరమేష్. బోట్ల ప్రసాద్. బొబ్బిలి వెంకటస్వామి యాదవ్. మాజీ ఎంపిటిసి రాచర్ల రమేష్. ప్రధాన కార్యదర్శి పిల్లి రాజశేఖర్. కొణిదల రాజన్న. ముదిగంటి రాజు. మైపాల్ రెడ్డి. చింతకుంట భరత్. గుండేటి గంగారం. దాసరి విజయకుమార్. రాజ్ కుమార్. తడగొండ రాజు. గడ్డం మల్లేశం. సంఘ శంకర్. షేర్ల పరశు రాం. బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

----------------



## నేరెళ్ల శ్రవణ్ మరణం పట్ల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్ర సంతాపం

మల్యాల, మే 20 (విజన్ ఆంధ్ర):

మల్యాల మండల బిజెపి మాజీ అధ్యక్షుడు, ప్రముఖ నాయకులు నేరెళ్ల శ్రవణ్ ఇటీవల అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం శ్రవణ్ నివాసానికి చేరుకుని, శ్రవణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... శ్రవణ్ అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా శ్రవణ్ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.?ఎమ్మెల్యే వెంట మల్యాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగ ఆనంద్ రెడ్డి, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్రవణ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

----------------

## శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు అభినందన



- కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం
- త్వరలోనే 350 మందికి ఉద్యోగ నియామకాలు
- కొత్తగా 9 బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి
- విజిలెన్స్ బాధితులకు న్యాయం చేసే వరకు పోరాటం
- ఐఎన్టియుసి నేత జనక్ ప్రసాద్

రామగుండం, మే 20 (విజన్ ఆంధ్ర) :

గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఐఎన్టియుసి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు గ్రహీతలు ఆరెపల్లి శ్రీనివాస్( టైసన్ శీను), వడ్డేపల్లి దాస్ ఘనంగా సన్మానించబడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, కార్మిక హక్కుల సాధనలో యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు కొనసాగింపు, పెర్క్స్ పై ఐటీ మినహాయింపు, 350 మందికి జూన్ లోగా నియామక పత్రాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. విజిలెన్స్ బాధితులకు న్యాయం చేసే వరకు పోరాడుతానని, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కొత్తగా తొమ్మిది బొగ్గు గనులను సాధించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, పిట్ సెక్రటరీలు పాల్గొని విజేతలను అభినందించారు

----------------

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు సభ్యత్వానికి అర్హుడు
- ఉచిత రక్తదాన శిబిరాలు, రోగులకు రక్తసాయం అందిస్తున్న రెడ్ క్రాస్
- కలెక్టర్ కోయ శ్రీహర్ష




పెద్దపల్లి ప్రతినిధి మే-20(విజన్ ఆంధ్ర)

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నిర్వహించిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటైన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మార్గదర్శకత్వంలో, రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ నాయకత్వంలో విస్తృత సేవలు అందిస్తున్న అతిపెద్ద సామాజిక సేవా సంస్థ అని పేర్కొన్నారు.మే 15 నుంచి జూన్ 15, 2026 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, ఉచిత రక్తదాన శిబిరాలు, క్యాన్సర్, సికిల్ సెల్, తలసేమియా బాధితులకు ఉచిత రక్తం అందించడం, సీనియర్ సిటిజన్ హోమ్స్, అనాథ శరణాలయాలు, ఉచిత ప్రసూతి వైద్యశాలల నిర్వహణ వంటి సేవలను రెడ్ క్రాస్ అందిస్తోందని వివరించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందంకు రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని కలెక్టర్ అందజేశారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు సభ్యత్వానికి అర్హుడని, ఆసక్తి గలవారు జీవిత, వైస్ ప్యాట్రన్ లేదా ప్యాట్రన్ సభ్యత్వాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. సభ్యత్వ నమోదు కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు ఆధార్, ఓటర్ ఐడి లేదా పాన్ కార్డు అవసరమని తెలిపారు.సభ్యత్వ నమోదు కోసం అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న తెలంగాణ రెడ్ క్రాస్ మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.జిల్లాలో కార్యక్రమ పర్యవేక్షణ కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ గ్రామీణ అభివృద్ధి అధికారులను నోడల్ అధికారులుగా నియమించామని, వారి కార్యాలయాల్లో ప్రత్యేక డేటా సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కార్యక్రమాన్ని నిరంతరం సమీక్షిస్తారని స్పష్టం చేశారు.అనంతరం జిల్లా యువజన క్రీడాశాఖ కార్యాలయంలో టూరిజం గైడ్ పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, ఉపాధి కల్పనాధికారి ,రాజశేఖర్, సహాయ కార్మిక అధికారి మహమ్మద్ రఫీ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కావేటి రాజగోపాల్, తదితరులు, పాల్గొన్నారు

# రైతుల విషయంలో రాజకీయాలకు తావులేదు..



- వడ్ల కొనుగోళ్ల పై మాట్లాడే అర్హత బి.ఆర్.ఎస్ పార్టీకి లేదు
- అక్రమ దందాల గురించి మీకు తెలిసినంత మాకెవ్వరికి తెలియదు..

-ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.

పెద్దపల్లి ప్రతినిధి మే-20(విజన్ ఆంధ్ర)

రైతుల విషయంలో రాజకీయ భేదాలు లేకుండా పార్టీలకు అతీతంగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో కొనుగోళ్లు పూర్తిగా పారదర్శకంగా జరుగుతున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.గత బీఆర్‌ఎస్ పాలనలో రైతుల పంటలకు కోతలు విధించి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు మరియు బీఆర్‌ఎస్ నాయకులు వడ్ల కొనుగోళ్లపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇసుక మాఫియా, మట్టి అక్రమ దందాలు చేసి తమ విద్యాసంస్థల్లో నిల్వ చేసిన విషయాలు ప్రజలకు తెలుసని, గతంలో పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ గోదాం రేకులు ఎత్తుకుపోయిన ఘటనలను కూడా ప్రజలు మరిచిపోలేదని విమర్శించారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంతో పాటు రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో వరి కొనుగోళ్లలో పెద్దపల్లి జిల్లా నాలుగో స్థానంలో ఉందని గుర్తు చేస్తూ, మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోళ్లు కొనసాగిస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు.ప్రజా ప్రభుత్వంపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించబోమని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను మభ్యపెట్టి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు మరియు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల మరియు పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

----------------



## సమగ్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

- ఆదర్శ నియోజకవర్గం లక్ష్యం
- మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- సమన్వయమే ప్రగతికి సోపానం
- క్షేత్రస్థాయిలో అందుబాటులో పాలన

రామగుండం, మే 20 (విజన్ ఆంధ్ర) :

రామగుండం అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ దూకుడు పెంచారు. ఈ క్రమంలో బుధవారం సింగరేణి, మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులను ఒకే వేదికపైకి తెచ్చి, నియోజకవర్గ ప్రగతిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస వసతులపై అధికారుల నిర్లక్ష్యాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత విషయంలో అస్సలు రాజీ పడొద్దని, పారదర్శకత పాటిస్తూనే వేగవంతంగా పనులు పూర్తి చేయాలని హుకుం జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేస్తూ, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా, ప్రతి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి ఫలితాలు చూపాలని గట్టిగా హెచ్చరించారు. రామగుండంను రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నానని ఆయన ప్రకటించారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధికారులందరూ ఒక టీమ్‌లా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

---------------

## కాంగ్రెస్ పార్టీ నూతన పట్టణ, అర్బన్, రూరల్ అధ్యక్షులను సన్మానించిన తోట లహరి- రాజేష్



వేములవాడ మే 20 (విజన్ ఆంధ్ర )

వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన తూమ్ మధు మరియు రూరల్ అధ్యక్షులుగా నియమితులైన సోయినేని కరుణాకర్, అర్బన్ అధ్యక్షులుగా నియమితులైన వంగ పరుశురాం గౌడ్ ఘనంగా వారి నివాసంలో శాలువతో పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట లహరి- రాజేష్ సన్మానించారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్నటువంటి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి నూతన అధ్యక్షుల ఆధ్వర్యంలో తీసుకెళ్తామని వారు అన్నారు... ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శీనన్న నాయకత్వంలో వేములవాడ పట్టణాన్ని అర్బన్ రూరల్ మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తూ వారికి చేదోడు వాదోడుగా పట్టణ, అర్బన్ రూరల్ అధ్యక్షుడిగా నియమితులైన వారు పార్టీని మరియు పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సహాయ శక్తుల కృషి చేయాలని వారు అన్నారు.

-------------

# రామగుండం గడ్డపై 'మక్కాన్' మంత్రం

- అభివృద్ధి బాటలో సరికొత్త ప్రస్థానం
పాలనలో పదును.. ప్రజలతో అనుబంధం
- సుందర రోడ్లు, వీధి దీపాలు
మెరుగైన పారిశుధ్యం, తాగునీటి సరఫరా
- ఆధునిక పార్కులు కమ్యూనిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు
ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- మహిళా సాధికారిత
వైద్యం, వైద్య శిబిరాలు
పారదర్శక సంక్షేమం
- అందరికీ మేలు
రెండున్నర ఏండ్ల పాలనలో "రాజు భాయ్" మార్క్




రామగుండం, మే 20 (విజన్ ఆంధ్ర) :

అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు.. అది ప్రతి సామాన్యుడి ముఖంలో కనిపించే చిరునవ్వు అని నమ్మే నాయకుడు.. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. అగ్రెసివ్ నాయకత్వంతో దూసుకుపోతూ, పాలనలో తనదైన ముద్ర వేస్తున్న ఆయన, ఇప్పుడు రామగుండం రూపురేఖలనే మారుస్తున్నారు.

### పాలనలో భేష్.. ప్రజలతో జోష్

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి మక్కాన్ సింగ్ కేవలం ఆఫీసుకే పరిమితం కాలేదు. గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను పంచుకోవడం ఆయన శైలి. 'ప్రజలతో మమేకం' కావడమే ఆయన విజయ రహస్యం. అందుకే రామగుండం ప్రజలు ఆయనను తమ ఇంటి మనిషిగా భావిస్తున్నారు. ఆయన రాకతో స్థానిక పాలనలో ఒక కొత్త ఉత్సాహం, 'జోష్' కనిపిస్తోంది.

### ప్రగతి పథంలో రామగుండం

మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తెచ్చిన 'డెవలప్‌మెంట్ మంత్రం' ఇప్పుడు రామగుండం నగరాన్ని మరో దశకు తీసుకెళ్తోంది. అత్యధిక నిధులను మంజూరు చేయించి, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయం.

### రవాణా వ్యవస్థ

గతంలో గుంతలమయంగా ఉన్న రోడ్లు ఇప్పుడు కనుమరుగై, సుందరమైన తారు రోడ్లు దర్శనమిస్తున్నాయి.

### పారిశుధ్యం

పరిశుభ్రమైన రామగుండమే లక్ష్యంగా పారిశుధ్య నిర్వహణను పక్కాగా అమలు చేస్తున్నారు.

### తాగునీరు

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరందించేందుకు మౌలిక వసతులను మెరుగుపరిచారు.

### వెలుగులు

మెయిన్ రోడ్లు, వీధులన్నీ ఎల్.ఈ.డి లైట్ల కాంతులతో మెరిసిపోతున్నాయి.

### పచ్చదనం, వినోదం

నగరంలో కొత్త పార్కులు, కమ్యూనిటీ సెంటర్ల నిర్మాణంతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వచ్చింది.

### పారదర్శకతే కొలమానం

సంక్షేమ పథకాలు అందరికీ సమానంగా అందాలనేది ఆయన నిరంతర ఆకాంక్ష. ఎటువంటి వివక్షకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజల చెంతకు చేరుస్తున్నారు. "నిజమైన అభివృద్ధి అంటే అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందడమే" అన్న ఆయన మాటలు, చేతల్లో కనిపిస్తున్నాయి.

---------------

# స్వావలంబనకు కొత్త అడుగు



- దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు
- ఉపాధి అవకాశాలు, ఆత్మవిశ్వాసం పెంపు
- సంక్షేమం--అభివృద్ధి సమన్వయంతో ముందుకు

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

రామగుండం, మే 20 (విజన్ ఆంధ్ర) :

రామగుండం నియోజకవర్గంలో దివ్యాంగుల సంక్షేమానికి మరో అద్భుతమైన అడుగు పడింది. గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్వయంగా పాల్గొని తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో 20 మంది లబ్ధిదారులకు మోటరైజ్డ్ ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఉచిత వాహనాల పంపిణీ ద్వారా వారి ఉపాధి అవకాశాలు పెరిగి స్వావలంబనకు దోహదం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు. వాహనాలు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సహాయం తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని భావోద్వేగంగా పేర్కొన్నారు. కార్యక్రమానికి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.